సాక్షి
నిజామాబాద్
శుక్రవారం ׀ 24 ׀ జనవరి ׀ 2025



స్పైస్ పార్క్ కార్యాచరణ..

పసుపు బోర్డు ఏర్పాటుతో స్పైస్ పార్క్ ప్రతిపాదన అటకెక్కినట్లే అని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- IIలో ▸



స్కూల్ బస్సు బోల్తా

నవీపేట మండలం కమలాపూర్ శివారులో ప్రైవేట్ పాఠశాల బస్సు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6 /13.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

పేరుకే రోడ్డు భద్రత



ఉమ్మడి జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతుంటాయి. తలకు గాయాలైన వారు మరణిస్తున్నారు. జీరో యాక్సిడెంట్స్ అంటూ నినాదాలు చేస్తూ రహదారి భద్రతా మాసోత్సవాలు, వారోత్సవాల్లో ఉపన్యాసాలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ట్రామా కేర్ సెంటర్ల గురించి మాత్రం ప్రస్తావించడం లేదు. ఇందల్‌వాయి టోల్ ప్లాజాలో ట్రా మాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్న హామీలు నీటి మూటలే అవుతున్నాయి.

- పట్టింపు లేని ట్రామాకేర్ సెంటర్
- ఏళ్లతరబడి ప్రతిపాదనలకే పరిమితం
- నామమాత్రంగా రోడ్డు భద్రత వారోత్సవాలు, మాసోత్సవాలు
- క్షతగాత్రులు గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికమే

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకునే రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారిని ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించేందుకు అన్ని ప్రాంతాల్లో ట్రామాకేర్ సెంటర్లు (అత్యవసర సేవల కోసం) నిర్వహించడం తప్పనిసరి. అయితే ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారి మీద, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఎక్కడా ట్రామాకేర్ సెంటర్లు లేవు. వీటిని ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వమే ఈ విషయాన్ని గాలికొదిలేసి రోడ్డు భద్రతా వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహిస్తుండడం గమనార్హం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం అవగాహన కార్యక్రమాల్లో ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు విషయం, వాటి ప్రాధాన్యత గురించి మాత్రం మాట్లాడకుండా మొక్కుబడిగా ముగించేస్తున్నారు.

అమలు కాని హామీ

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలై మరణిస్తున్నారు. ఇందులో యువకులే అధికంగా ఉంటున్నారు. జీరో యాక్సిడెంట్స్ అంటూ నినాదాలు చేస్తూ రహదారి భద్రతా మాసోత్సవాలు, వారోత్సవాల్లో ఉపన్యాసాలిస్తున్న అధికారులు, ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సత్వర చికిత్స కోసం ఉద్దేశించిన ట్రామా కేర్ సెంటర్ల గురించి మాత్రం మాట్లాడడం లేదు. ఇందల్‌వాయి టోల్ ప్లాజా నుంచి సమీపంలో ఉన్న డిచ్‌పల్లి ఆస్పత్రిలో కానీ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కేంద్రాల్లో ఉన్న ఆస్పత్రుల్లో కానీ ట్రామా కేర్ సెంటర్లు లేవు. దీంతో 'జీవించే హక్కు'ను హరించడమే అవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో ఉంటే ఆర్థో సర్జరీ విభాగమే కాకుండా ప్రత్యేకంగా న్యూరో సర్జరీ, సీటీ స్కాన్, ఐసీయూ, బ్లడ్ బ్యాంక్, రేడియాలజీ విభాగాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలతో ట్రామా కేర్ సెంటర్ తప్పనిసరిగా ఉండాలి. ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయకుండా జీరో యాక్సిడెంట్స్ నినాదాలెన్ని చేసినప్పటికీ ఫలితం లేదు. టోల్ ప్లాజాలలో వాహన వినియోగదారుల నుంచి కచ్చితంగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్న టోల్ ప్లాజా నిర్వాహకులు సైతం ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. 2005 సంవత్సరం నుంచి ఇందల్‌వాయి టోల్ ప్లాజాలో చార్జీల వసూలు అవుతోంది. ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని అనేకసార్లు హామీలు ఇచ్చినప్పటికీ అవి నీటి మూటలే అవుతున్నాయి.

నిబంధనలున్నా..

జాతీయ, రాష్ట్ర రహదారులకు 30 కిలోమీటర్ల దూరం లోపు ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా ట్రామా కేర్ సెంటర్లు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. 2017లో రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో 11 చోట్ల ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. అయితే కార్యరూపం దాల్చలేదు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు, కేంద్ర ప్రభుత్వం 70 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2017 ప్రతిపాదనల ప్రకారం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. జాతీయ రహదారి మీద ఉన్న ఇందల్వాయి టోల్ ప్లాజా నుంచి నిజామాబాద్‌లోని జీజీహెచ్ 26 కిలోమీటర్ల దూరంలో ఉంది. తలకు గాయమైనవారిని గోల్డెన్ అవర్‌లో ట్రామా కేర్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు. సెంటర్ లేకపోవడంతో ప్రమాదాలకు గురైన వారు ప్రాణాలు కోల్పోతున్నారు.


జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రితో పాటు తెలంగాణలోని అన్ని రాష్ట్ర, జాతీయ టోల్ ప్లాజాల వద్ద ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో వాహన వినియోగదారుల సంక్షేమం దృష్ట్యా జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం.

– సొంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి

ఐదుకు బదులు.. పది టీఎంసీలు

- వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలింపు
- ఆయకట్టు రైతుల ఆందోళన



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా ఈ సీజన్‌లో మిడ్ మానేరుకు పది టీఎంసీలు తరలించారు. మిడ్‌మానేరుకు 5 టీఎంసీల నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రాజెక్ట్ అధికారులు మొదట్లో చెప్పారు. కానీ ఇప్పటి వరకు వరద కాలువ ద్వారా పది టీఎంసీలు వదిలారు. గురువారం మధ్యాహ్నం కాలువకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. డిసెంబర్ 31 నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. ఐదు వేల క్యూసెక్కులను కాలువకు వదిలారు. ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు వరద కాలువ ద్వారా నీటి కేటాయింపులు చేపట్టలేదు. కనీసం నివేదికలో చూపలేదు. అయినా మిడ్ మానేరు పేరు చెప్పి నీటిని తరలించారు. ఈ సీజన్‌లో మళ్లీ వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపడితే ఆయకట్టుకు సాగునీటి తిప్పలు తప్పవు అని ప్రాజెక్ట్ అధికారులే అంటున్నారు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 90 టీఎంసీల సామర్థ్యం ఉన్న సమయంలోనే యాసంగిలో చివరలో ఆయకట్టుకు నీరు అందక అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయింది. దీంతో పంటలకు చేతికందే సమయంలో నీరు అందక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా ఉన్నత అధికారులు ఆదేశానుసారం నీటి విడుదలను చేపట్టాం. గురువారం నీటి విడుదల నిలిపివేయాలని ఆదేశాలు రావడంతో ఆపేశాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

భోజనంలో నాణ్యత పాటించాలి



ధర్మారం(బి) గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా
- ధర్మారం(బి) గురుకుల పాఠశాల పరిశీలన

డిచ్‌పల్లి: గురుకుల పాఠశాలల్లో భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలు విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి యోగితా రాణా హెచ్చరించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధన పద్ధతులు, అధ్యాపకుల తీరును సమీక్షించారు. పాఠశాలలో వసతులు, బోధనపై సమీక్షించారు. కళాశాల స్థాయిలో ప్రయోగశాలల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్, డీఈవో అశోక్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హామీలపై సర్కార్‌ను ప్రశ్నించండి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



ఆర్మూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ నిజామాబాద్ అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ అన్యాయాలను నిలదీయాలన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆరు గ్యారెంటీలకే గతి లేదన్నారు. ఇక ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అన్నారు.

ధర్పల్లిలో కేంద్ర అధికారుల బృందం పర్యటన



ధర్పల్లి: ధర్పల్లి సబ్ సెంటర్ పరిధిలో మూడు నెలల క్రితం డెంగీ కేసు నమోదు కావడంతో కేంద్ర అధికారుల బృందం గురువారం గ్రామంలో పర్యటించింది. సైంటిఫిక్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న చోట నుంచి నమూనాలను సేకరించారు. పలుచోట్ల నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉన్నట్లు గుర్తించారు. డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ హరి దత్తు, సూపర్‌వైజర్ భూలక్ష్మి ఉన్నారు.

స్పౌజ్ బదిలీలకు ధ్రువపత్రాల పరిశీలన




నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో స్పౌజ్ బదిలీలకు సంబంధించి గురువారం ధ్రువపత్రాలు పరిశీలించారు. 57 మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాల నుంచి స్పౌజ్ బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ పరిశీలన చేపట్టారు. అనంతరం పాఠశాలలను కేటాయించారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఒక టీచర్ నిజామాబాద్ జిల్లాకు స్పౌజ్ బదిలీపై వచ్చింది. ఆమె భర్త ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నట్లు ధ్రువపత్రాల్లో పేర్కొంది. కానీ అతను రెగ్యులర్ బదిలీల్లో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లినట్టు ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలన చేశారు. సదరు ఉపాధ్యాయురాలితో అండర్ టేకింగ్ తీసుకున్నారు. తర్వాత విచారణ చేపడతామని విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నాగారం: సబ్సిడీ రుణాల కోసం జిల్లాలోని దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎస్‌కే రసూల్‌బీ గురువారం ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు దివ్యాంగులు స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకోవడానికి వంద శాతం సబ్సిడీపై రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.50 వేల చొప్పున 35 మందికి రుణం అందిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 2లోపు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో లేదా https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెరుగైన వైద్యం అందించాలి



మోర్తాడ్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. గురువారం మోర్తాడ్‌లోని 30 పడకల ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహించగా ఆపరేషన్లు చేసిన వైద్యులతో మాట్లాడారు. లక్ష్యానికి అనుగుణంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ బాబు, వైద్యులు రవీందర్, ప్రవీణ్‌కుమార్, వివేక్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో కొనసాగిన ఆందోళనలు

నిజామాబాద్ అర్బన్: జిల్లావ్యాప్తంగా గురువారం గ్రామ, వార్డుసభలు కొనసాగాయి. మూడో రోజు కూడా అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవంటూ ప్రజలు అధికారులను నిలదీశారు. గ్రామసభల్లో అధికారులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను ప్రదర్శించారు. దీంతో ఆయా పథకాలకు సంబంధించిన జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో అధికారులను ప్రజలు ప్రశ్నించారు. బాల్కొండలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. జాబితాలో పేర్లు రాని వారి నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.



డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జిల్లావ్యాప్తంగా 137 గ్రామ పంచాయతీలలో, 40 వార్డుల్లో సమావేశాలు జరిగాయి. కాగా గ్రామ, వార్డు సభలు శుక్రవారంతో ముగియనున్నాయి.



బాల్కొండలో గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు

అనర్హులను తొలగిస్తాం

ధర్పల్లి: ప్రభుత్వం అందించే పథకాలు అర్హులైన వారికే కేటాయిస్తామని, గ్రామసభ జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే వాటిని తొలగిస్తామని ధర్పల్లి మండల ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సభలో అధికారులు జాబితాలో పేర్లను ప్రకటించగానే అనర్హుల పేర్లు ఉన్నాయని, తాము వంద శాతం అర్హులమని పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయని కొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మూడుసార్లు సంక్షేమ పథకాలపై దరఖాస్తులు ఇవ్వగా అధికారుల తప్పిదం, నిర్లక్ష్యంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని ప్రజలు వాపోయారు.



ధర్పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్

రిజర్వేషన్లపై ఉత్కంఠ



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

- ఈ నెల 26తో ముగియనున్న మున్సిపల్ పాలకవర్గాల పదవీ కాలం
- మరోసారి పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

ఆర్మూర్: మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం కొద్దిరోజుల్లో ముగియనుంది. అయినా మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 26తో పాలకవర్గాల పదవీ కాలం ముగియనుండటంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్ స్థానాల రిజర్వేషన్లు మారనుండటంతో ఆయా మున్సిపాలిటీల పరిధిలోని ఆశావహుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. జిల్లాలో నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నోటిఫికేషన్ ఆధారంగా ముందుగా వార్డుల వారిగా రిజర్వేషన్లు ఖరారు చేసిన అనంతరం చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రతీ ఐదేళ్ల ఎన్నికకు రిజర్వేషన్లలో మార్పు చేసేవారు. అయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక గత బల్దియా ఎన్నికల ముందు కొత్త మున్సిపల్ చట్టం అమలులోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం పదేళ్ల(రెండు ఎన్నికలకు) వరకు ఒకే రిజర్వేషన్ అమలులో ఉంటుంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పింది. దీంతో ఈ సారి రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ చట్టంలో ఐదేళ్లకు ఓ సారి రిజర్వేషన్ మారేలా మార్పులు చేసినట్లు తెలిసింది.

బీసీ కులగణనతో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇటీవల బీసీల కుల గణన పూర్తి చేసింది. ఈ నివేదిక ఆధారంగా మున్సిపల్ ఎన్నికల్లో ఆయా సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యతనిస్తూ రిజర్వేషన్ల ప్రక్రియ అమలు చేస్తారని చర్చ సర్వత్రా వినిపిస్తోంది. దీంతో ఆశావహులు తమ వార్డుల్లో ఏ సామాజిక వర్గం వారు ఎక్కువ ఉన్నారు..? తమ వార్డుకు ఏ రిజర్వేషన్ ఖరారు అయ్యే అవకాశం ఉందంటూ లెక్కలు వేసుకుంటున్నారు. కాగా 2019–2020 నాటి ఎన్నికల్లో మున్సిపాలిటీలకు మూడు కిలో మీటర్ల పరిధిలోని గ్రామాలను విలీనం చేయడం ద్వారా పరిధిని విస్తరించారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులె, ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులు, బోధన్‌లో 38 వార్డులు, భీమ్‌గల్‌లో 12 వార్డులను విభజించారు. మరో వైపు మొత్తం స్థానాల్లో 50 శాతం సీట్లు మహిళలకే రిజర్వు కానున్నాయి.

పోటీ చేయడానికి సన్నాహాలు

మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడంతో చైర్ పర్సన్, కౌన్సిలర్‌గా పోటీలో నిలవాలనుకొనే వారు ఆందోళన చెందుతున్నారు.ఏడాది క్రితం రాష్ట్రంలో జరిగిన అధికార మార్పిడితో తమ ప్రాంత అభివృద్ధి పేరుతో మెజారిటీ చైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లు పార్టీ మారారు. వచ్చే ఎన్నికల్లో సైతం అధికార పార్టీ బీ ఫాం సాధించుకొని పోటీలో నిలవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. కానీ రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడంతో తమ సొంత వార్డుల్లో రిజర్వేషన్లు తమకు కలిసి రాకపోతే ఎట్లా అంటూ అయోమయానికి గురవుతున్నారు. కాగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటి నుంచే అందుకు తగ్గట్లు పావులు కదుపుతున్నాయి. దీంతో రిజర్వేషన్ల లెక్క తేలితే బల్దియా పోరు రసవత్తరంగా మారనుంది.

వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

బోధన్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు, గ్రామసభల ద్వారా సేకరించిన వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. బోధన్ మండలం బండార్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. వివిధ పథకాల కోసం గ్రామసభలో కొత్తగా వచ్చిన దరఖాస్తుల గురించి ఆరా తీశారు. ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. అనంతరం బోధన్ పట్టణ శివారులో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, సరుకుల నాణ్యతను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



బండార్‌పల్లి గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

క్లుప్తంగా

కేంద్ర మంత్రి గోయల్‌తో ఎంపీ భేటీ



సుభాష్‌నగర్‌: కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌ గోయల్‌తో ఢిల్లీలోని తన కార్యాలయంలో ఎంపీ అర్వింద్‌ ధర్మపురి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన పల్లె గంగారెడ్డికి కేంద్రమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కల సాకారమైనందుకు పసుపు రైతుల సంక్షేమానికి తోడ్పడాలని చైర్మన్‌కు మంత్రి సూచించారు. అలాగే పసుపు ఎగుమతులు, మార్కెటింగ్‌, పలు అంశాలపై వారు చర్చించారు. బోర్డు విధి విధానాలు, డైరెక్టర్లు, సభ్యుల ఎంపిక, తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, త్వరలోనే ప్రకటిస్తామని మంత్రి తెలిపారు. తనను జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు పల్లె గంగారెడ్డి మంత్రికి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. వారి వెంట బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మోరెపల్లి సత్యనారాయణ ఉన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్‌: వివిధ కేసుల్లో సీజ్‌ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను ఈనెల 25వ తేదీన మామిడిపల్లిలోని ఎక్సైజ్‌ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్‌సన్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11గంటల వేలం ప్రారంభమవుతుందని, పాల్గొనాలనుకునే వారు 25శాతం డిపాజిట్‌ జమ చేయాలని సూచించారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్‌ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం వెలుగు చూసింది. దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందని, 9052672351నంబర్‌తో మొబైల్‌ ఫోన్‌ లభించిందని ఎస్సై రాజు తెలిపారు.

స్పైస్‌ పార్క్‌ కార్యాచరణ లేనట్టేనా..?

- ఇప్పటికీ మొదలుకాని పనులు
- ప్రతిపాదన అటకెక్కినట్టేనా..
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న పసుపు రైతులు



వేల్పూర్‌ క్రాస్‌ రోడ్డు వద్ద స్పైస్‌ పార్క్‌ కోసం సేకరించిన స్థలం

మోర్తాడ్‌(బాల్కొండ): పసుపు రైతులను ప్రోత్సహించేందుకు నిర్దేశించిన స్పైస్‌ పార్క్‌కు సంబంధించి ఇప్పటి వరకు కార్యాచరణ మొదలు కాకపోగా, మరోవైపు పసుపు బోర్డు ప్రారంభంతో ఈ పార్క్‌ ప్రతిపాదన అటకెక్కినట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పసుపు బోర్డు ఏర్పాటు అంశం కేంద్రం పరిధిలో ఉండగా, బోర్డును ప్రారంభించడం ఆలస్యమైన విషయం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో తామే పసుపు రైతులకు అండగా ఉంటామని 2016లో అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం స్పైస్‌ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పసుపు అత్యధికంగా సాగు చేసే నిజామాబాద్‌ జిల్లాలోనే స్పైస్‌ పార్క్‌ కోసం 75 ఎకరాల స్థలాన్ని సేకరించారు. రూ.30 కోట్లు కేటాయించి స్థల సేకరణ, ప్రహరీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులు పూర్తి చేశారు. స్పైస్‌ పార్క్‌లో పసుపు క్రయవిక్రయాలను సాగించి, పంట నిలువ కోసం కోల్డ్‌ స్టోరేజీలు, గోదాముల నిర్మాణం, రైతులు, వ్యాపారుల కోసం షెడ్లు, విశ్రాంతి గదులు, పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. స్థల సేకరణ విజయవంతమైనప్పటికీ స్పైస్‌ పార్క్‌లో కార్యకలాపాలకు సంబంధించిన కార్యాచరణపై అప్పటి ప్రభుత్వం దృష్టి సారించలేకపోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పసుపు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసి పసుపు ఆధారిత పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ అది కూడా శంకుస్థాపనకే పరిమితమైంది. చివరకు కేంద్ర ప్రభుత్వం ఏడాది క్రితం పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన చేయడం, సంక్రాంతి రోజున కేంద్ర మంత్రి వర్చువల్‌గా పసుపు బోర్డును నిజామాబాద్‌ కేంద్రంగా ప్రారంభించడం చేశారు. బోర్డుకు ఇక్కడి రైతు నేత పల్లె గంగారెడ్డిని జాతీయ చైర్మన్‌గా ఎంపిక చేసిన విషయం విదితమే. పసుపు బోర్డు కార్యక్రమాలకు సంబంధించి విధి విధానాలను కేంద్రం ఖరారు చేయాల్సి ఉంది. పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో స్పైస్‌ పార్క్‌ కోసం సేకరించిన స్థలాన్ని పసుపు రైతుల కోసం వినియోగంలోకి తీసుకువస్తారా? లేదా? అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెల్లడించాల్సి ఉంది. రెండు ప్రభుత్వాలు సమన్వయం చేసుకుంటేనే స్పైస్‌ పార్క్‌ స్థలం వినియోగంలోకి వస్తుంది. ఈ స్థలాన్ని పసుపు రైతుల కోసం వినియోగిస్తే వారికి కలిసి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా స్పైస్‌ పార్క్‌ స్థలంలో పసుపు క్రయవిక్రయాలు, పసుపు ఆధారిత పరిశ్రమలు తదితర కార్యక్రమాలు ప్రారంభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని స్పైస్‌ పార్క్‌ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు మేలు చేయాలి



స్పైస్‌ పార్క్‌ను రైతులకు మేలు కలిగేలా ఉపయోగించాలి. పసుపు బోర్డును జిల్లాలో ఏర్పాటు చేయడం ఎంతో బాగుంది. స్పైస్‌ పార్క్‌ స్థలాన్ని వినియోగంలోకి తీసుకువస్తే ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. నిరుద్యోగులు, కార్మికులకు ఉపాధి అవకాశాలు వృద్ధి చెందుతాయి.

– సంజీవరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్‌, దొన్కల్‌

స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



స్పైస్‌ పార్క్‌ కోసం విశాలమైన స్థలాన్ని సేకరించారు. పసుపు బోర్డును ప్రారంభించడంతో పంట క్రయ విక్రయాలు, పరిశ్రమలను ఇక్కడే మొదలు పెడితే రైతులకు లాభం జరుగుతుంది. స్పైస్‌ పార్క్‌ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

– దేగాం రాములు, రైతు, అంక్సాపూర్‌

‘గార్డ్‌’ టీజర్‌, ఆడియో విడుదల





మాట్లాడుతున్న హీరో విరాజ్‌రెడ్డి.. జబర్దస్త్‌ టీమ్‌ బుల్లెట్‌ భాస్కర్‌, ఫైమా తదితరుల ప్రదర్శన

నిజామాబాద్‌ రూరల్‌: మోపాల్‌ మండలం కంజర గ్రామానికి విరాజ్‌రెడ్డి హీరోగా నటించిన ‘గార్డ్‌’ సినిమా టీజర్‌, ఆడియో రిలీజ్‌ ఫంక్షన్‌ను గురువారం రాత్రి నర్సింగ్‌పల్లి శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌ గార్డెన్‌లో అట్టహాసంగా నిర్వహించారు. జగా పెద్ది దర్శకత్వంలో, అనసూయ నిర్మాతగా వ్యవహరించిన ‘గార్డ్‌’ సినిమాను తెలుగు, మలయాళం, తమిళం, ఇంగ్లిష్‌, హిందీ, కన్నడ, చైనీస్‌ భాషల్లో విడుదల చేయనున్నట్లు హీరో విరాజ్‌రెడ్డి తెలిపారు. నుడా చైర్మన్‌ కేశ వేణు, హీరో విరాజ్‌ సన్నిహితుడు గోపి ఆడియోను విడుదల చేశారు. జబర్దస్త్‌ టీమ్‌ బుల్లెట్‌ భాస్కర్‌, ఫైమా తదితరులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ఏఎంసీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ జగన్‌, అజయ్‌, రామర్తి గోపి, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆడియో రిలీజ్‌ ఫంక్షన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల, ప్రముఖులు

పంట పొలాల్లో స్కూల్‌ బస్సు బోల్తా

- ఇద్దరు విద్యార్థులకు గాయాలు
- నవీపేట మండలం కమలాపూర్‌లో ఘటన



వరి మడిలో బోల్తాపడిన స్కూల్‌ బస్సు

నవీపేట: మండలంలోని కమలాపూర్‌ శివారులో గురువారం ఉదయం ప్రైవేట్‌ పాఠశాల బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని సాహితీ పాఠశాల బస్సు గురువారం నాడాపూర్‌కు చెందిన 30 మంది చిన్నారులను తీసుకుని కమలాపూర్‌ మీదుగా నవీపేటకు బయల్దేరింది. కమలాపూర్‌ శివారులోని అంకాలమ్మ పోలేరమ్మ ఆలయ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. రెగ్యులర్‌ డ్రైవర్‌కు బదులు క్లీనర్‌ భోజన్న బస్సును అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదంలో నాడాపూర్‌కు చెందిన నాల్గో తరగతి విద్యార్థిని మీనాక్షి, యూకేజీ విద్యార్థిని నామాన్షిలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్‌

లారీ ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అర్సపల్లి రైల్వే గేటు వద్ద గురువారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అర్సపల్లికి చెందిన తరికంటి యాదయ్య(78) గ్రామశివారులోని వ్యవసాయభూమిలో పనులు పూర్తి చేసుకుని టీవీఎస్‌ ఎక్సెల్‌పై ఇంటికి వస్తుండగా రైల్వే గేటు మూలమలుపు వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో మండల కేంద్రానికి చెందిన మున్నూరు మహిపాల్‌(40) అనే వ్యక్తి మృతి చెందాడు. గురువారం ఉదయం మహిపాల్‌ బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.



మహిపాల్‌ (ఫైల్‌)

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మోపాల్‌: మండలకేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డిచ్‌పల్లికి చెందిన జమీల్‌ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్‌ తెలిపారు. కంజర్‌ శివారులోని ఫిల్టర్‌ బెడ్‌లో విధులు నిర్వర్తించే జమీల్‌ మోపాల్‌ మండలకేంద్రంలో నడుచుకుంటూ వెళ్తుండగా పెట్రోల్‌ బంకు వద్ద వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. జమీల్‌కు తీవ్రగాయాలుకాగా, బైక్‌పై ఉన్న కంజర్‌ గ్రామానికి చెందిన గంగాధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జమీల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

డిచ్‌పల్లి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో ముగ్గురు వ్యక్తులకు జిల్లా సెకండ్‌ క్లాస్‌ జ్యుడిషియల్‌ మెజిస్ట్రేట్‌ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు. ఈ నెల 21న రాత్రి వాహనాల తనిఖీ చేపట్టగా, అమృతాపూర్‌, సాంపల్లి, మోపాల్‌ మండలం బాడ్సి గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. ముగ్గురిని గురువారం జిల్లా సెకండ్‌ క్లాస్‌ జ్యుడిషియల్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరు పర్చగా ఒక్కొక్కరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూసెన్స్‌ చేసిన వ్యక్తికి ఒక రోజు..

బోధన్‌టౌన్‌(బోధన్‌): మద్యం మత్తులో డయల్‌ 100కి కాల్‌ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసిన వ్యక్తికి బోధన్‌ కోర్టు సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శేషతల్పసాయి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పట్టణంలోని గోషాలకు చెందిన షేక్‌ ఫారూక్‌ మద్యం మత్తులో డయల్‌ 100కు పలుమార్లు ఫోన్‌ చేసి సమయాన్ని వృథా చేయడంతో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులను సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చగా ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్‌ చేయాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

స్కూటీ చోరీ కేసులో అరెస్ట్‌, రిమాండ్‌

డిచ్‌పల్లి: ఈనెల 21వ తేదీన మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన దుబ్బాక సోమయ్య ఇంటి ఎదుట పార్క్‌ చేసిన స్కూటీని ఎత్తుకెళ్లిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లేశ్‌ ఆదేశాల మేరకు ఎస్సై–2 సత్యం సిబ్బందితో కలిసి నాగ్‌పూర్‌ గేటు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టగా, బిచ్కుంద మండలం బండరెంజల్‌ గ్రామానికి చెందిన మంగలి దత్తు అలియాస్‌ అవారా దత్తు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా స్కూటీని తానే దొంగిలించినట్లు అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్‌ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న స్కూటీ తో పాటు నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డిచ్‌పల్లి పోలీసులు

ఫైనాన్స్‌ వేధింపులు తాళలేక ఆత్మహత్య



ప్రవీణ్‌గౌడ్‌ (ఫైల్‌)

టీటీపేట: ప్రైవేట్‌ ఫైనాన్స్‌ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని తుజాల్‌పూర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సుంకరి ప్రవీణ్‌గౌడ్‌ (32) ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్‌ హౌసింగ్‌ ఫైనాన్స్‌ కంపెనీలో సుమారు రూ.3లక్షల లోన్‌ తీసుకున్నాడు. అలాగే బయటి వ్యక్తుల వద్ద మరి కొన్ని అప్పులు చేశాడు. ప్రతి నెలా ఫైనాన్స్‌ కిస్తులు చెల్లించడం కష్టంగా మారడం, కంపెనీ ప్రతినిధులు డబ్బుల కోసం ఒత్తిడి పెంచడంతో ప్రవీణ్‌గౌడ్‌ మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన ప్రవీణ్‌గౌడ్‌ బుధవారం సాయంత్రం ఇంటి నుండి బయటికి వెళ్లి తన సోదరుడికి ఫోన్‌ చేశాడు. అప్పులు ఎక్కువయ్యాయని, ఆర్థిక ఇబ్బందులు తాళలేక చనిపోతున్నానని తెలిపి ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేశాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. గురువారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ప్రవీణ్‌ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని పోచమ్మగల్లీకి చెందిన పాల్కి అభిలాష్‌(23) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కూలీ పనులు చేసి జీవించే అభిలాష్‌ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

చెరువులో దూకి వివాహిత..



రేణుక(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన రేణుక(35) అనే మహిళ బుధవారం ఉదయం జప్తిజాన్కంపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. మెదక్‌ జిల్లా పాపన్నపేట మండలం జయరాంతండాకు చెందిన దేవసోత్‌ ధన్‌సింగ్‌ కూతురు రేణుకను పదేళ్ల క్రితం నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన మలావత్‌ రామ్‌చంద్‌కు రెండో భార్యగా ఇచ్చి వివాహం చేశారు. కాగా రేణుకను భర్తతోపాటు అతడి మొదటి భార్య కొడుకు సూర్య, కోడలు గంగి మానసికంగా, శారీరకంగా వేధించడంతో గతేడాది అక్టోబర్‌ 26న తల్లిగారింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో ఒప్పించి గతేడాది డిసెంబర్‌ 30న రేణుకను రాంచందర్‌తో పంపించగా, బుధవారం గ్రామసమీపంలోని చెరువులో దూకి రేణుక ఆత్మహత్య చేసుకుంది. తన కూతురి మరణంపై భర్త రాంచందర్‌తోపాటు ఆయన మొదటి భార్య కొడుకు, కోడలిపై అనుమానాలు ఉన్నట్లు రేణుక తండ్రి ధన్‌సింగ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులను చూపుతున్న ఎక్సైజ్‌ పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌: గంజాయి విక్రేతలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్‌ ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్‌సన్‌ గురువారం తెలిపారు. అంకాపూర్‌ సమీపంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు రూట్‌ వాచ్‌ నిర్వహిస్తున్న సమయంలో అంకాపూర్‌కు చెందిన నూనె శ్రీకాంత్‌, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన కిరణ్‌ ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి నుంచి 1.6 కేజీల ఎండు గంజాయితోపాటు బైక్‌, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లా ఇచ్చోడ నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎస్సై చంద్రమౌళి, సిబ్బంది సాయిలు, దేవీదాస్‌, నరేశ్‌, సందీప్‌, శ్రీనివాస్‌, సాగర్‌, కవిత, గంగాధర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

దాస్‌నగర్‌ వద్ద ఒకరు..



గంజాయిని చూపుతున్న మాక్లూర్‌ పోలీసులు

మాక్లూర్‌: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. మండలంలోని దాస్‌నగర్‌ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి తమను చూసి పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని విచారించామన్నారు. నవీపేట మండలం కమలాపూర్‌కు చెందిన మెట్టుమల్ల శ్రీకాంత్‌గా అతడిని తనిఖీ చేయగా 110 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. డబ్బు సంపాదించాలనే ఆశతో నాందెడ్‌ తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు శ్రీకాంత్‌ ఒప్పుకున్నాడన్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి : గంజాయి సరఫరా చేస్తున్నాడనే సమాచారం మేరకు జిల్లా కేంద్రంలో జునైద్‌ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 700 గ్రాముల గంజాయిని ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దాడిలో ఎక్సైజ్‌ సీఐ స్వప్న, ఎస్సై రాము, సిబ్బంది పాల్గొన్నారు.